సాక్షి
జోగులాంబ గద్వాల

మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



నూతన పాలకమండలి..
అలంపూర్ జోగుళాంబ ఆలయ నూతన పాలక మండలికి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది.

వివరాలు 8లో ▸



గురుకులానికి తాళం
వనపర్తి ఎస్సీ గురుకుల భవనానికి అద్దె చెల్లించడం లేదని తాళం వేశారు.

వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 30.1 /23.3
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఐటీఐలో ప్రవేశాలకు ఆహ్వానం

గద్వాల అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో 2024–25, 2025–26 విద్యాసంవత్సరానికి ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ కోర్సులలో మిగిలిన సీట్లకు వాక్–ఇన్ ఇంటర్వ్యూ పద్ధతిన భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు సంవత్సరాల కోర్సులు ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డ్రాఫ్ట్‌మన్ సివిల్, ఎలక్ట్రీషియన్ కోర్సులు, ఏడాది కోర్సులు డీజిల్, కోప అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సులకు పదో తరగతి పాస్ అయి 2020సంవత్సరం ఆగస్టు నాటికి 14 సంవత్సరాలు నిండిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 20వ తేదీలోగా iti.telangana.gov.inఅనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు ఫారాలను జిల్లా కేంద్రంలోని కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లను అందజేయాలని తెలిపారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ పాలన : డీకే అరుణ



గద్వాలటౌన్: వికసిత్ భారత్ లక్ష్యంగా దేశంలో ప్రధాని నరేంద్రమోదీ పాలన సాగిస్తున్నారని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ తెలిపారు. జిల్లా కేంద్రంలో చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం ఎంపీ డీకే అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా 36వ వార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 18 కోట్ల మంది సభ్యులతో ప్రపంచంలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రతి ఒక్కరితో సభ్యత్వం చేయించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని నిర్దేశించారు. 2047 నాటికి ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశంగా భారత్ నిలుస్తోందని చెప్పారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను నమ్మి ప్రజలు ఇప్పటికే మోసపోయి గోసపడుతున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికి చాలామంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ కాలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో వృద్ధులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులకు రాసిచ్చిన బాండ్లు బౌన్స్ అయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కరెంటు కష్టాలు మొదలయ్యాయని చెప్పారు. అతి తక్కువ కాలంలోనే రేవంత్ సర్కార్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనపై రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని, రానున్న రోజుల్లో తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. అనంతరం డిజిటల్ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భరత్‌ప్రసాద్, రామచంద్రారెడ్డి, శ్రీకాంత్, డీకే స్నిగ్ధారెడ్డి, కౌన్సిలర్ జయశ్రీ,, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

సకల విఘ్నాలు తొలగాలని..
వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని డీకే అరుణ గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు మండపాలలోని వినాయకుని విగ్రహాలను దర్శించుకున్నారు.

పౌష్టికాహారం అందించాలి



మల్దకల్: బాలింతలకు సరైన పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సీడీపీఓ నాగరాణి అంగన్‌వాడీ టీచర్లను సూచించారు. పోషణమాసంలో భాగంగా సోమవారం మండలంలోని అమరవాయి, మల్దకల్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమరవాయి అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన గర్భిణులు, బాలింతల సమావేశంలో సీడీపీఓ మాట్లాడారు. పండ్లు, ఆకుకూరలతో పాటు ఐరన్ ఎక్కువగా ఉండే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, ముఖ్యంగా కాన్పు, కాన్పుకు మధ్య రెండు సంవత్సరాల తేడా ఉండేలా చూడాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు నెలనెలా క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారులను గుర్తించి వారికి సరైన పౌష్టికాహారం అందించి వారి ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. సూపర్‌వైజర్ బాలమ్మ, అంగన్‌వాడీ టీచర్లు యశోదమ్మ, పద్మమ్మ, తిమ్మమ్మ పాల్గొన్నారు.

మిల్లర్ల అక్రమ దందా..!

సీఎమ్మార్ పేరిట పలువురు మిల్లర్ల అడ్డదారి



నాలుగు నెలలైనా సీఎమ్మార్ బియ్యం అందించని దువాస్‌పల్లి రైస్‌మిల్

- గతంలో రూ.20కోట్ల విలువైన ధాన్యం మాయం
- కేసులు నమోదు చేసి వదిలేసిన అధికారులు
- తాజాగా ఏడు మిల్లులకు రూ.45 కోట్ల ధాన్యం కేటాయింపులు
- ఇప్పటి వరకు కేవలం రూ.18కోట్ల విలువైన బియ్యం అందజేత
- నాలుగు మిల్లులు ఖాతా సైతం తెరవని వైనం
- రికవరీ చేయడంలో అధికారుల అలసత్వం

గద్వాల: జిల్లాలో సీఎమ్మార్ పేరిట కొందరు మిల్లర్లు యథేచ్ఛగా అక్రమ దందా కొనసాగిస్తున్నారు. 2021–22 ఖరీఫ్‌కి సంబంధించి రూ.20కోట్ల విలువైన ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు దోచేయడం అప్పట్లో సంచలనంగా మారగా సదరు మిల్లర్లపై కేసులు నమోదు చేసి మూడేళ్లు కావస్తున్నా దానికి సంబంధించి వ్యక్తులపై ఎలాంటి చర్యలు లేవు. తాజాగా 2023–24రబీ సీజన్‌కు సంబంధించి ఏడు రైస్ మిల్లర్లకు సుమారు రూ.45కోట్ల విలువైన ధాన్యం కేటాయించగా నాలుగు నెలలు గడచిపోయినా ఇప్పటి వరకు కేవలం ముగ్గురు రైస్ మిల్లర్లు రూ.18కోట్ల విలువైన సీఎమ్మార్ బియ్యం అందించగా.. మిగిలిన నాలుగు రైస్ మిల్లర్ల నుంచి ఒక్క బియ్యం సంచి కూడా రాలేదు. నిర్దేశించిన గడువు ముగిసిపోతున్నా అధికారులు మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తుండడం పట్ల పలు అనుమానాలకు తావిస్తుంది. సీఎమ్మార్ పేరిట జరుగుతున్న దోపిడీపై కథనం..

రూ.20కోట్ల ధాన్యం కుంభకోణం..

2021–22 ఖరీఫ్‌కు సంబంధించి రూ.20కోట్ల ధాన్యం పక్కదారి పట్టడం అప్పట్లో పెద్ద సంచలనంగా మారింది. ఇందులో అయిజలోని అన్నపూర్ణ రైస్ మిల్లు, గద్వాల మండలం కాకులారం శ్రీకృష్ణారైస్ మిల్లు, శాంతినగర్‌లోని సూర్య రైస్‌మిల్లులపై ధాన్యం కుంభకోణంలో చోటుచేసుకున్న అవినీతిపై అప్పటి సివిల్‌సప్లై డీఎం ప్రసాద్‌రావు ఫిర్యాదు మేరకు ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయి. అయితే ఆర్ఆర్ యాక్టు ప్రకారం ఆస్తులు జప్తు చేయాల్సి ఉండగా అధికారులు మాత్రం అక్రమార్కులకు కొమ్ముకాశారనే బలమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా సివిల్‌సప్లై శాఖలో పనిచేసి ఇటీవల రిటైర్డ్ అయిన ఓ అధికారికి ఈ కుంభకోణంలో పెద్ద ఎత్తున ముడుపులు ముట్టినట్లు, దాని కారణంగానే సొమ్ముకాజేసిన సదరు మిల్లర్ల నుంచి రికవరీ చేయడంలో తాత్సారం చేస్తూ సహకరించారనే విమర్శలున్నాయి. ఈ అవినీతి వ్యవహారంపై కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులకు హెచ్చరికలు జారీ చేయడంతో చలనం వచ్చింది. అధికారులు ఆర్ఆర్ యాక్టును అమలు చేసేందుకు ఉపక్రమించారు. తీసుకున్న ధాన్యానికి సంబంధించిన బియ్యం ప్రభుత్వానికి పెడతామని ఇందుకు సంబంధించి గడువు ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వానికి అర్జీ పెట్టుకోవడంతో ప్రస్తుతం దీనిపై రాష్ట్ర ఉన్నతాధికారుల వద్ద పరిశీలనలో ఉంది.

తాజాగా రూ.45కోట్ల ధాన్యం కేటాయింపులు

మరోవైపు 2023–24 రబీ సీజన్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఏడు రైస్ మిల్లులకు 19,138 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించారు. దీని విలువ సుమారు రూ.45కోట్లు వరకు ఉంటుంది. ఇందుకు సంబంధించి 447.456 ఏసీకేల సీఎమ్మార్ బియ్యం అందివ్వాల్సి ఉండగా, నాలుగు నెలలు గడుస్తున్నా ముగ్గురు మిల్లర్లు 184 ఏసీకేల సీఎమ్మార్ బియ్యం అందించగా, మిగిలిన నలుగురు మిల్లర్లు ఒక్క బియ్యం సంచి అందివ్వకపోవడం గమనార్హం. అయితే ఇందులో మూడు రైస్ మిల్లర్ల యజమానులు ధాన్యాన్ని బయట మార్కెట్‌లో విక్రయించి సొమ్ముచేసుకున్నారనే విమర్శలున్నాయి. ఇదిలాఉండగా, గతంలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి కేసు నమోదు చేసిన ఓ మిల్లర్‌కు సైతం ధాన్యం కేటాయించడం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది.

2023-24 రబీ సీజన్‌లో కేటాయించిన ధాన్యం వివరాలు

మిల్లు పేరు	కేటాయించిన ధాన్యం (మెట్రిక్ టన్నుల్లో)	అందించాల్సిన బియ్యం (ఏసీకేలో)	అందించించి
శ్రీసాయి ట్రేడింగ్ కంపెనీ, బీచుపల్లి	4,758.240	111.528	51.000
జగదాంబ ఆగ్రోటెక్, అనంతపురం	4482.640	104.936	69.000
శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సాయి పారా బాయిల్డ్ రైస్ మిల్, కోదండాపురం	2835.840	66.496	64.000
మణికంఠ రైస్ ఇండస్ట్రీస్, కొండపల్లి, గద్వాల	4118.080	96.482	000
జోగుళాంబ రైస్ మిల్, బుక్కాపురం	255.280	5.898	000
శ్రీలక్ష్మీ వెంకటేశ్వర మాడ్రన్ రైస్ మిల్, దువాస్‌పల్లి	606.360	14.009	000
కమ్మిడిస్వామి రైస్‌మిల్, నందిన్నె	2082.280	48.108	000

చర్యలు తీసుకుంటాం

గతంలోని రూ.20కోట్ల సీఎమ్మార్ బియ్యానికి సంబంధించి మిల్లర్లు బియ్యం అందిస్తామని అర్జీ పెట్టుకోవడంతో దానిని ప్రభుత్వానికి పంపించాం. తదుపరి ఉత్తర్వులు రావాల్సి ఉంది. తాజాగా రబీ సీజన్‌కు సంబంధించి రావాల్సిన సీఎమ్మార్ బియ్యాన్ని అన్ని రైస్ మిల్లర్ల నుంచి తీసుకునేలా ఇప్పటికే అధికారులను ఆదేశించాం. ఎవరైన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ప్రభుత్వ పరంగా కఠిన చర్యలు తీసుకుంటాం.

– బీఎం సంతోష్, కలెక్టర్





బీచుపల్లి వద్ద క్రేన్ సహాయంతో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు, కృష్ణానది ఒడిలోకి చేరుతున్న గణపయ్య

గంగమ్మ ఒడికి గణనాథుడు

ఎర్రవల్లి: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడురోజులపాటు భక్తులచే విశేష పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుతున్నాడు. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి గణనాథులను తీసుకువచ్చి బీచుపల్లి వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. సుదూర ప్రాంతాల నుంచి గణనాథులను ఇక్కడికి తీసుకువచ్చి నిమజ్జనం చేస్తుండటంతో స్థానికంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్‌జాం కాకుండా ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించారు. బీచుపల్లి పుష్కర ఘాట్‌ను అలంపూర్ సీఐ రవిబాబు నిమజ్జనం సరళిని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

ప్రజలను చైతన్యం చేసిన ప్రజాకవి కాళోజీ



కాళోజీ నారాయణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: తన రచనల ద్వారా ప్రజలను చైతన్యం కల్పించిన ప్రజాకవి కాళోజీ నారాయణ రావు అని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో తెలంగాణ స్వాతంత్య్ర సమరయోధుడు కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కాళోజీ తెలుగు బాష ప్రజల అవసరాలకు కోసం పాటుపడిన వ్యక్తి అని, తన కవితలు, రచనల ద్వారా ప్రజల్లో స్ఫూర్తిని నింపారని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఇంచార్జ్ బీసీ సంక్షేమశాఖ అధికారి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ ఆశయాలను కొనసాగిద్దాం
ఎర్రవల్లి: ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం నిరంతరం శ్రమించినటువంటి కాళోజీ నారాయణరావు ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పదో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని బీచుపల్లి పదో బెటాలియన్‌లో కాళోజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం సాధించడం కోసం కవితలతో ఆయన చేసిన సేవలు మరవలేనివన్నారు. ఎలాంటి పదవులు ఆశించకుండా కేవలం ప్రత్యేక తెలంగాణ కోసం తన కవితలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతగానో పోరాడారన్నారు. తన కవితలతో ప్రజల్లో ఉద్యమ భావాజాలాన్ని వ్యాప్తి చేస్తూ రాష్ట్ర సాధన కోసం పోరాడి తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు చౌహాన్, శ్రీనివాసరావు, ఆర్‌ఐలు రాజారావు, గోపాల్, పటాలం అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



కాళోజీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అడిషనల్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం

ప్రజావాణికి 50 అర్జీలు

గద్వాల: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 50 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ బీఎం సంతోష్ వివిధ ప్రాంతాల నుంచి సమస్యలు తెలిపేందుకు వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదులును వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు నర్సింగరావు, శ్రీనివాస రావు, ఆయాశాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

కదిలిన అధికార యంత్రాంగం

గట్టు: చిన్నోనిపల్లె పునరావాస కేంద్రానికి అధికార యంత్రాంగం కదిలింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చిన్నోనిపల్లె గ్రామంలోకి రిజర్వాయర్ నీరు వచ్చి చేరడంతో గ్రామస్తులు ఒక్కొక్కరుగా గ్రామాన్ని ఖాళీ చేస్తున్నారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు గద్వాల ఆర్డీఓ రాంచందర్ ఆధ్వర్యంలో సోమవారం అధికార యంత్రాంగం చిన్నోనిపల్లె పునరావాస కేంద్రానికి చేరుకుంది. ముంపునకు గురైన చిన్నోనిపల్లె గ్రామస్తులకు పునరావాస కేంద్రంలో ప్లాట్లను కేటాయించడంతో పాటుగా తాగు నీటి వసతి, విద్యుత్ సౌకర్యం వంటి పనులను దగ్గరుండి చేయిస్తున్నారు. మొత్తం 360 మందికి సంబంధించిన ప్లాట్లను నలుగురు అధికారులతో బృందాలుగా ఏర్పడి 90 మంది చొప్పున ప్లాట్లను గుర్తించి, లేఅవుట్ ప్రకారం గతంలో కేటాయించిన మాదిరిగానే లబ్ధిదారులకు ప్లాట్లను గుర్తించి, కేటాయించే విధంగా చర్యలు తీసుకున్నారు. గతంలో అందజేసిన ప్లాట్లకు సంబంధించిన పత్రాల్లో లోటుపాట్లు ఉన్నట్లయితే అధికారులు అక్కడిక్కడే వాటిని సరిదిద్ది అందజేస్తున్నారు. చుట్టు పక్కల పంచాయతీ సిబ్బందిని పునరావాస కేంద్రానికి రప్పించి, డ్రైయినేజీల శుభ్రం చేయించారు. రిజర్వాయర్ బ్యాక్ వాటర్ గ్రామంలోకి వచ్చిన తరుణంలో గ్రామస్తులు ఇళ్లను వదిలి పెట్టారు. ముంపు గ్రామంలో ఇళ్లలోకి నీరు వచ్చి దెబ్బతిన్న ఇళ్లను సైతం గుర్తించే పనిలో ఉన్నారు.



పునరావాస కేంద్రంలో ప్లాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ, అధికారులు

ప్రత్యేక బృందాల పనుల పర్యవేక్షణ..
తహసీల్దార్లు, ఎస్‌ఐలు, ఆర్‌ఐలు, ఏఈలు, సర్వే అధికారులు బృందాలుగా ఏర్పడి పునరావాస కేంద్రంలో మౌలిక వసతులు, ఇతర పనులపై దృష్టి సారించారు. తహసీల్దార్లు సరితారాణి (గట్టు), వెంకట్‌రావు(ధరూరు), జుబేర్‌అహ్మద్(మల్దకల్), రాధాకృష్ణ (కలెక్టరేట్), ఎస్‌ఐలు మల్లేష్(గట్టు), అబ్దుల్‌షకూర్(ధరూరు), సురేష్(మల్దకల్), విజయ్‌భాస్కర్(అయిజ)తో పాటుగా ఆర్‌ఐలు, ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు, సర్వే అధికారులు, బృందాలుగా ఏర్పడి చిన్నోనిపల్లె పునరావాస కేంద్రంలో ముంపు గ్రామస్తులకు అవసరమైన పనులను చేపట్టారు. ఎక్కడా ఏ ఇబ్బంది కలగకుండా అధికారులు అప్పగించిన పనులను పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఆర్డీఓ రాంచందర్ దగ్గరుండి పనులు పర్యవేక్షిస్తున్నారు. సమస్యలు, సందేహాలను అక్కడిక్కడే నివృత్తి చేశారు. మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ సర్పంచు పద్మాదేవేందర్ సైతం పాల్గొన్నారు. ఇదిలాఉండగా, ముంపునకు గురైన ఇళ్లకు చెందిన వారు పునరావాస కేంద్రానికి చేరుకోగా.. వారికి అక్కడే అధికారులు భోజన వసతి ఏర్పాటు చేశారు.

● అనిరుధ్ X లక్ష్మారెడ్డి

సై అంటే సై..!

తారస్థాయికి తాజా, మాజీ ఎమ్మెల్యేల వార్

- ఆరోపణలు–ప్రత్యారోపణలు, సవాళ్లతో నిత్య రచ్చ
- రసవత్తరంగా మారిన జడ్చర్ల రాజకీయం
- నలిగిపోతున్న ప్రభుత్వ అధికారులు, సిబ్బంది
- ఎటు పోయి ఎవరికొస్తోందోనని ఆందోళన





సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: హాట్‌హాట్ రాజకీయాలతో జడ్చర్ల అసెంబ్లీ సెగ్మెంట్ అట్టుడుకుతోంది. తాజా, మాజీ ఎమ్మెల్యేలు జనంపల్లి అనిరుధ్ రెడ్డి (కాంగ్రెస్), చర్లకోల లక్ష్మారెడ్డి (బీఆర్‌ఎస్).. ఆయన వర్గీయుల మధ్య ఆరోపణలు–ప్రత్యారోపణలు చర్చనీయాంశంగా మారాయి. ఇరువురు, ఇరు వర్గాల మధ్య సవాళ్లు–ప్రతి సవాళ్లతో నియోజకవర్గంలో నిత్యం యుద్ధ వాతావరణం నెలకొంది. తాజా, మాజీల మధ్య వార్ తారస్థాయికి చేరుకోగా.. మాటల తూటాలు పేలుతుండడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు, భూ కేటాయింపులపై రచ్చ జరుగుతుండగా.. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది బెంబేలెత్తుతున్నారు. ఎవరి మెడకు చుట్టుకుంటుందో ననే భయం వారిలో వ్యక్తమవుతోంది.

ఆరోపణలతో 'షు'రూ..
గత డిసెంబర్‌లో ఎన్నికల ముందు మాజీ మంత్రి లక్ష్మారెడ్డిపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అనేక ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రాగా.. బీఆర్‌ఎస్ హయాంలో భూ అక్రమాలు జరిగాయంటూ లక్ష్మారెడ్డితో పాటు ఆ పార్టీకి చెందిన పలువురిపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఆయన ఫిర్యాదు చేశారు. బాలానగర్ వద్ద చెరువుకట్టపై మీడియా సమావేశం పెట్టి.. అక్కడ జరిగిన అక్రమాలపై మాట్లాడారు. ఆ తర్వాత

డెడ్‌లైన్‌తో కంటిన్యూ..

గంగాపూర్‌లో షూ పంపిణీ కార్యక్రమంలో అనిరుధ్ ప్రధానంగా మాట్లాడుతూ వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రికి సంబంధించి లక్ష్మారెడ్డి మేనల్లుడు భూ అక్రమాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. ఈ నేపథ్యంలో లక్ష్మారెడ్డి మీడియా సమావేశంలో ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆస్పత్రి నిర్మాణానికి పట్టణంలో ఎక్కడా స్థలం లేకపోవడంతో గంగాపూర్ రోడ్ పక్కన అసైన్డ్ ల్యాండ్‌ను వెనక్కి తీసుకుని నిర్మించామని తెలిపారు. రాజకీయాలతో సంబంధం లేని తన మేనల్లుడుపై నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదన్నారు. పూర్తి పారదర్శకంగా భూమిని కొనుగోలు చేశామని.. ఇప్పటికైనా పట్టణంలో ఆస్పత్రికి స్థలం కొనుగోలు చేసి ఇస్తే.. తన సొంత డబ్బుతో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తమపై చేసిన ఆరోపణలకు అనిరుధ్‌రెడ్డి వారంలోగా సమాధానం ఇవ్వాలని డెడ్‌లైన్ విధించారు. ఈ క్రమంలో లక్ష్మారెడ్డి, ఆయన బంధువుల భూబాగోతాలు బయటపెడుతానంటూ అనిరుధ్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా ప్రకటించడం.. సోమవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించడంపై ఆరోపణల పర్వం డెడ్‌లైన్‌తో కంటిన్యూ అయిందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

ప్రభుత్వ అధికారులు ఉక్కిరిబిక్కిరి..

గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జడ్చర్ల నియోజకవర్గ పరిధిలో లక్ష్మారెడ్డి, అనిరుధ్‌రెడ్డి మధ్య నువ్వా.. నేనా అన్నట్లు పోటాపోటీ రాజకీయాలు నెలకొన్నాయి. ఎన్నికలు పూర్తయినా.. ఈ సెగ్మెంట్‌లో ఆ హీట్ ఇంకా తగ్గలేదు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై వస్తున్న ఆరోపణలు ప్రధానంగా ప్రభుత్వ అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్లు చేస్తోంది. ఈ క్రమంలో నియోజకవర్గంలోని పలు మండలాల్లో ప్రధాన ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు సెలవుపై వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

రాజకీయ వాతావరణం కొన్నాళ్లు స్తబ్దుగానే ఉంది. విద్యార్థులకు సొంతంగా బూట్లు పంపిణీ చేస్తున్నట్లు అనిరుధ్‌రెడ్డి ప్రకటించగా.. బీఆర్‌ఎస్ నాయకులు ఆయనపై సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టారు. సెజ్ నుంచి వచ్చిన డబ్బులతో విద్యార్థులకు బూట్లు పంపిణీ చేస్తున్నారని వైరల్ చేయడంతో గంగాపూర్ వేదికగా అనిరుధ్‌రెడ్డి స్పందించారు. అప్పటినుంచి ఇరువురి మధ్య ఆరోపణలు, సవాళ్ల పర్వం కొనసాగుతోంది.

క్లుప్తంగా

వాగులో గల్లంతైన మహిళ మృతి

• డ్రోన్ సాయంతో గుర్తింపు



నవాబుపేట: వాగు దాటుతూ.. వరద ఉధృతిలో కొట్టుకుపోయిన మహిళ మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని ఇప్పటూర్ వాగులో చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కొందుర్గు మండలం గంగన్నగూడెంకి చెందిన పుష్పమ్మ(56) ఆదివారం తన గ్రామం నుంచి బయలుదేరింది. కాగా రాజాపూర్ మండలం దొండ్లపల్లి వరకు బస్సులో వచ్చిన ఆమె.. అక్కడి నుంచి కాలి నడకన వాగు పక్కలోని చౌటపల్లికి బంధువుల ఇంటికి బయలుదేరింది. కాగా మధ్యలో వాగు దాటుతున్న క్రమంలో వాగు ఉధృతికి నీటిలో కొట్టుకుపోయింది. రాత్రి వరకు బంధువుల ఇంటికి చేరకపోవటంతో ఆమె కుటుంబ సభ్యులు ఆందోళన చెంది సోమవారం వెతకటం ప్రారంభించారు. కాగా గ్రామానికి చెందిన వీడియోగ్రాఫర్ సాయంతో డ్రోన్ కెమెరా ఉపయోగించి వాగు పరిసరాలు పరిశీలించి గ్రామానికి కిలోమీటర్ దూరంలో మహిళ మృతదేహం గుర్తించారు. ఈ విషయంలో మృతురాలి కుమార్తె సింధు ఫిర్యాదుతో ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలియజేశారు.

కొనసాగుతున్న గాలింపు



రాజాపూర్: ఆత్మహత్యకు పాల్పడుతున్నానని బంధువులకు ఫోన్ చేసి శుక్రవారం అర్ధరాత్రి మండల పరిధిలోని దుందుభీ వాగులో దూకిన గుండ్లపొట్లపల్లికి చెందిన చెన్నమ్మ గుర్తింపు కోసం మూడురోజులుగా గాలింపు సాగుతోంది. పోలీసులు, ఫైర్‌సిబ్బంది వాగులో గాలింపు చేపడుతున్నా ఎటువంటి ఆచూకీ లభించలేదు. సోమవారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సైతం వాగులో సిబ్బందిలో కలిసి గాలించారు.

వేతనం అందలేదని ఆత్మహత్యాయత్నం



నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): మండలంలోని అల్లీపూర్‌లో కార్మికుడిగా పనిచేస్తున్న సూరంపల్లి బాలపీరు(62) తనకు రావల్సిన 7 నెలల వేతనం అందలేదని, సోమవారం స్థానిక గ్రామపంచాయతీ ఎదుట పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలపీరు కొద్ది సంవత్సరాలుగా గ్రామపంచాయతీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అనారోగ్యం, సరైన సమయానికి వేతనం రావడం లేదని బాలపీరు మే నెలలో పని మానేశాడు. దీంతో తనకు రావాల్సి వేతనం ఇవ్వాలని సోమవారం పంచాయతీ కార్యదర్శి దివ్యను కోరాడు. ఈ క్రమంలో తనకు రావాల్సిన వేతనం గురించి వివరిస్తుండనే ఆవేశంతో బాలపీరు పురుగు మందు తాగాడు. వెంటనే స్థానికులు ఆ డబ్బాను తీసుకుని హుటాహుటిన నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడా ఉందని వైద్యులు వివరించారు. ఈ విషయమై అల్లీపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి దివ్యను వివరణ కోరగా.. బాలపీరుకు 7 నెలల వేతనం పెండింగ్‌లో ఉందని, ఆ మొత్తం ఎస్టీఓలో జమ చేశామని, కాని ఆయన మే నెలలో ఉద్యోగం మానేయడంతో డబ్బులు జమ కావడంలో కాస్త జాప్యం జరిగిందన్నారు.

తండ్రిపై కుమారుడి దాడి

• తలకు తీవ్ర గాయాలు
• ఆస్పత్రికి తరలింపు

కొత్తకోట రూరల్: కన్న తండ్రిపై కుమారుడు దాడి చేయగా.. తండ్రి తలకు తీవ్ర గాయాలైన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం రామకృష్ణాపురంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామకృష్ణాపురానికి చెందిన మధుగమ్ వెంకటయ్య, దేవమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు మధుగమ్ పరమేష్‌కు రెండేళ్ల కిందట వివాహమైంది. పెళ్లైన ఏడాదికే వేరే కాపురం పెట్టుకున్నాడు. ఆ సమయంలో తల్లిదండ్రుల వద్ద ఉన్న గేదెల్లో సంగం గేదెలను పరమేష్‌కు ఇచ్చాడు. తల్లిదండ్రుల వద్ద ఉన్న మిగతా గేదెలను ఆదివారం తీసుకెళ్లాడు. సోమవారం ఉదయం గేదెలను మేతకు తీసుకెళ్లి సాయంత్రం ఇంటికి తీసుకొస్తుండగా.. మా గేదెలు మాకు ఇవ్వాలని తల్లిదండ్రులు కోరారు. కోపోద్రిక్తుడైన పరమేష్ చేతిలోని కర్రతో తండ్రిపై దాడి చేయగా.. తలకు తీవ్ర గాయాలయ్యాయి. మళ్లీ గేదెలను అడిగితే చంపేస్తానంటూ ఇంటికి వెళ్లిపోయాడు. తలకు తీవ్ర గాయాలైన వెంకటయ్యను భార్య దేవమ్మ స్థానికుల సహకారంతో ఆస్పత్రికి తీసుకెళ్లింది. వెంకటయ్య భార్య దేవమ్మ ఫిర్యాదు మేరకు కుమారుడు పరమే ష్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలియజేశారు.

నూతన పాలకమండలికి గ్రీన్ సిగ్నల్



అలంపూర్ జోగులాంబ ఆలయం

• అలంపూర్ జోగులాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయాలకు నోటిఫికేషన్ జారీ
• ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్
• 15 రోజుల్లో పూర్తికానున్న ప్రక్రియ



సీఎంను కలిసి మాట్లాడుతున్న సంపత్‌కుమార్(ఫైల్)

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయానికి నూతన పాలకమండలిని నియమించేందుకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. దీంతో రాష్ట్ర దేవాదాయశాఖ పాలకమండలి నియామకం కోసం ఉత్తర్వులు వెలువరించింది. ఆగస్టు 28న ఎల్ఆర్ ఆర్‌సీ నం.ఎఫ్4/8228/2024 రూల్-4 ప్రకారం 30/87 యాక్ట్‌ను అనుసరిస్తూ దేవాదాయ చట్టం 17 ద్వారా నోటిఫికేషన్ జారీ చేశారు. గత పాలకమండలి మే-31న ముగియడంతో మూడు నెలల వ్యవధిలోనే నూతన పాలకమండలి నియామకం కోసం దేవాదాయశాఖ కమిషనర్ చర్యలు తీసుకోనున్నారు. రాష్ట్రంలో ఏకైక శక్తిపీఠం కావడంతో పరిపాలన సౌలభ్యం మరియు దేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని శక్తిపీఠమైన జోగుళాంబ ఆలయానికి పాలకమండలిని నియమించాలని ఇటీవల ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. అలాగే దేవాదాయశాఖ మంత్రి కొండాసురేఖను కలిసి పాలకమండలి నియామకం కోసం కృషిచేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సంబంధిత దేవాదాయశాఖ అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలకు నూతన పాలక మండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రకియ 15 రోజుల్లో పూర్తి కానుంది.

తెరచాటు ప్రయత్నాలు..

అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయానికి నియమించే పాలకమండలిలో నేనంటే నేనంటూ రాజకీయ నిరుద్యోగులు ఎవరి ప్రయత్నాల్లో వారు తెరచాటు ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. గత పాలకమండలి నుంచి కొందరు ప్రయత్నాలు చేస్తుండగా.. మరికొందరు సంపత్‌కుమార్ వర్గం నుంచి ప్రయత్నిస్తుండగా.. మరికొందరు తమకు సీఎం సోదరుల ద్వారా ప్రయత్నిస్తున్నారు. ఇలా ఎవరి ప్రయత్నాల్లో వారు పోటీ పడుతున్నారు.

పరిపాలనా సౌలభ్యం..

దేవాదాయశాఖలో అధికారుల కొరత ఉండటంతో ప్రతి ఆలయంలో పని చేసే ఈఓలకు ప్రస్తుత ఆలయంతో పాటుగా అదనంగా 4 నుంచి 6 ఆలయాలు ఇన్‌చార్జ్‌లుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో జోగుళాంబ ఆలయం ఈఓకు సైతం జోగుళాంబ ఆలయంతో పాటుగా జమ్మిచేడు జములమ్మ దేవస్థానం, సంతాన వేణుగోపాల స్వామి ఆలయం, నదీ అగ్రహారం, జానకమ్మ సత్రం, పాగుంట వెంకటేశ్వర ఆలయం, రాజోళి వైకుంఠనారాయణ స్వామి ఆలయాలకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అలంపూర్ క్షేత్రంలో పాలకమండలి నియామకంతో పరిపాలన సౌలభ్యం కొంత మేరకు మెరుగుపడే అవకాశం ఉంది.

జూరాలకు 2.05 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

• 26 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల



జూరాల ప్రాజెక్టు వద్ద 26 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఆదివారం సాయంత్రానికి 1,55,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. సోమవారం సాయంత్రానికి 2.05 లక్షలకు క్యూసెక్కులకు పెరిగింది. దీంతో 26 గేట్ల ద్వారా ఎత్తి 1,82,780 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో 11 యూనిట్లను కొనసాగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఇందుకోసం 27,076 క్యూసెక్కుల నీటిని వినియోగించు కుంటున్నారు. క్రస్ట గేట్లతో పాటు ఆవిరి రూపంలో 46 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2కు 650 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 290 క్యూసెక్కులు, కుడి కాల్వకు 160 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 2,11,002 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.790 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా.. ఎగువన ఉన్న అల్మట్టి ప్రాజెక్టుకు ప్రస్తుతం 93,744 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 1,01,638 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 1,09,907 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి 1,08,720 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వేగవంతంగా విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాల ఎగువ విద్యుత్ కేంద్రంలోని ఐదు యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 150.126 ఎంయూ, దిగువలో ఆరుయూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 120.213 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఇప్పటివరకు 270.339 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని పేర్కొన్నారు.

సుంకేసులలో 8 గేట్లు ఎత్తివేత

రాజోళి: సుంకేసుల డ్యాంలో సోమవారం 8 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 38,277 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా.. గేట్ల ద్వారా 35,832 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం

అచ్చంపేట రూరల్/నాగర్‌కర్నూల్ క్రైం: అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అచ్చంపేట పట్టణంలోని పలువురి ఇళ్లలో పౌరసరఫరాల ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి ఆలయ సమీపంలో వారుగంటి సాయిప్రసాద్ ఇంటి వద్ద అక్రమంగా నిల్వ చేసిన 18 క్వింటాళ్లు, త్రివేణి కళాశాల సమీపంలోని రామస్వామి ఇంటి వద్ద నిల్వచేసిన 31 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ హేమ్ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాము తెలిపారు.

▪ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం నుంచి తిర్మలాపూర్‌కు ఆటోలో తరలిస్తున్న 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో స్థానిక ట్యాంక్‌బండ్‌పై పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా.. డిప్యూటీ తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఫిర్యాదు అందలేదని, మంగళవారం కేసు నమోదు చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

శ్రీశైలం నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలి



రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

వనపర్తి రూరల్: జీఓ 98 ప్రకారం శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీశైలం డ్యాం బ్యాక్‌వాటర్‌లో ఉమ్మడి జిల్లాలోని 67 గ్రామాలు పూర్తిగా మునకకు గురయ్యాయని తెలిపారు. ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి జీఓ 98 ప్రకారం కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కమిటీ ఏర్పాటుకే పరిమితమైందని వాపోయారు. కాగా, శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చిన్నారెడ్డి హామీ ఇచ్చారు.

మహ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయం



స్టేషన్ మహబూబ్‌నగర్: అల్లా చివరిదూత మహ్మద్ ప్రవక్త (స.అస) మార్గం అనుసరణీయమని జామీయ నిజామియాకు చెందిన ప్రొఫెసర్ ముఫ్తి ఖలీల్ అహ్మద్ అన్నారు. మిలాదున్నబీ వేడుకలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఆలిండియా సున్ని ఉల్‌మా మషాయక్ బోర్డు ప్రధాన కార్యదర్శి మౌలానా మొహసిన్‌పాష ఖాద్రీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు ఆసారే ముబారక్ ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఖలీల్ అహ్మద్ ధార్మిక సందేశం ఇచ్చారు. మొహసిన్‌పాష ఖాద్రీ, ఆయా రాష్ట్రాల మతపెద్దలు హజ్రత్ సయ్యద్ ముర్తుజా అలీ అప్సర్‌పాష, ఖాజా సయ్యద్ అబుతురాబ్‌షాఖాద్రీ, ఖాజీ అబ్దుల్ హక్, మౌలానా రఫీయోద్దీన్ ఫారుఖీ, మౌలానా షంసీర్ హుస్సేని, నేమతు ల్లాషా ఖాద్రీ, మౌలానా ఇస్మాయిల్ హాష్మి, డాక్టర్ రిజ్వాన్ ఖురేషి, అహ్మద్ నక్షబంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆర్థిక వృద్ధి



మాట్లాడుతున్న పాలెం కేవీకే సమన్వయకర్త డా.ప్రభాకర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): రైతులు ప్రస్తుత వ్యవసాయంలో రసాయన ఎరువులు వినియోగించడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతిని పంట ఉత్పత్తి తగ్గడమే కాకుండా సాగు ఖర్చు పెరుగుతుందని పాలెం కేవీకే కో-ఆర్డినేటర్ డా.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రైతులు ప్రస్తుత కృత్రిమ వ్యవసాయం మానేసి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గడమే కాకుండా దిగుబడి పెరిగి ఆర్థిక వృద్ధి సాధించ వచ్చన్నారు. సోమవారం పాలెం కేవీకేలో ప్రకృతి వ్యవసాయంపై నైపుణ్యం, శిక్షణ కార్యక్రమం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో బీజామృతం, జీవామృతం, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం, ఇతర కషాయాలను ఉపయోగించి చీడపీడలను తగ్గించుకోవడంతో పాటు పంటలకు అవసరమైన పోషకాలను పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఆదిశంకర్, రాజశేఖర్, జ్యోత్స్న, రైతులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల, కళాశాలకు తాళం



భవనం బయట పడిగాపులు కాస్తున్న ఉపాధ్యాయులు

• అద్దె చెల్లించలేదని విద్యార్థులను లోపల ఉంచి తాళం వేసిన యజమాని
• బయటే నిలబడిపోయిన ఉపాధ్యాయులు
• ఉన్నతాధికారుల చొరవతో గంట తర్వాత తాళం తీసిన యజమాని

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాల భవనానికి సంబంధించి నెలవారి అద్దె చెల్లించడం లేదని ఇంటి యజమాని విద్యార్థులను లోపలే ఉంచి, ఉపాధ్యాయులను బయటికి నెట్టేసి తాళం వేసిన సంఘటన సోమవారం రాత్రి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో వనపర్తి నియోజకవర్గంలోని పెద్దమందడి మండలానికి ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాల మంజూరైంది. స్థల ప్రభావం కారణంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని నాగవరం శివారులో అనూస్ విద్యాసంస్థల యజమాని బిల్డింగ్‌లో పాఠశాల, కళాశాలను నెట్టుకొస్తున్నారు. ఇక్కడ ఉన్న రెండు భవనాలకు కలిపి రూ.7 లక్షలకు పైచిలుకు అద్దె చెల్లించాల్సి ఉండగా.. కొన్ని నెలలుగా అద్దె చెల్లించడం లేదు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన సదరు భవన యజమాని ఉపాధ్యాయులందరిపై కేకలు వేసి బయటకు పంపించాడు. విద్యార్థులను లోపలే ఉంచి పాఠశాల, కళాశాల భవనాలకు తాళం వేశాడు. దీంతో చేసేదేమి లేక బోధించే ఉపాధ్యాయులు, అధ్యాపకులు బిల్డింగ్ బయట పడిగాపులు కాశారు. గంట తర్వాత ఉన్నతాధికారులు దృష్టి సారించడంతో భవన యజమాని తాళం తీసినట్లు తెలుస్తోంది. దీనిపై పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్, ఇతర అధికారులు స్పందించేందుకు నిరాకరించడంతో పాటుగా మీడియాకు వివరాలు వివరించేందుకు విముఖత చూపారు. ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతుంది.

శిక్ష నుంచి నిందితులు తప్పించుకోవద్దు



డీఐజీ ఎల్ఎల్ చౌహాన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

గద్వాల: నేరానికి పాల్పడిన నిందితులకు తప్పకుండా చట్టరీత్యా శిక్షపడేలా కేసును పర్యవేక్షించాలని డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. సోమవారం ఆయన గద్వాలకు వచ్చి ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాస్‌రావుతో మైనర్‌లపై జరిగిన లైంగిక దాడిపై ప్రత్యేకంగా సమీక్షించారు. రెండు రోజుల కిందట గద్వాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్ విద్యార్థినులపై లైంగిక దాడి చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేసి వారిని రిమాండుకు పంపాలన్నారు. అంతేకాకుండా నిందితులకు చట్టపరమైన శిక్షపడేవరకు కేసుకు అవసరమైన సాక్ష్యాధారాల సేకరణ, పర్యవేక్షణ చేయాలన్నారు. ఎస్పీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ లైంగిక దాడిలో మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన వడ్డే తిరుమలేష్(20), దౌదర్‌పల్లికి చెందిన కోరి గోపాల్(22), గద్వాల పట్టణం రెండో రైల్వేగేట్‌కాలనీకి చెందిన తెలుగు నరేష్, షేరెల్లివీధికి చెందిన కుమ్మరి నర్సింహ(21), భవానినగర్ వీధికి చెందిన వడ్ల అభిషేక్‌తోపాటు దౌదర్‌పల్లికి చెందిన 16 ఏళ్ల బాలుడు సైతం లైంగిక దాడిలో పాల్పడినట్లు గుర్తించామని, వీరంతా బాలికలను ఓ గదిలో బంధించి ఒకరోజుపాటు లైంగిక దాడికి పాల్పడ్డారన్నారు. వీరిపై పోక్సో యాక్టుతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీలతో కూడిన రేప్ కేసును గద్వాల రూరల్ స్టేషన్‌లో నమోదు చేసినట్లు వివరించారు. నిందితులకు చట్టపరంగా కఠినంగా శిక్షపడేలా చర్యలు తీసుకుంటున్నామని, అలాగే పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

కలెక్టర్, డీఐజీకి వినతి

బాలికలపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. సోమవారం ఆమె కలెక్టర్ బీఎం సంతోష్, డీఐజీ ఎల్ఎస్ చౌహాన్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమె వెంట నాయకులు కృష్ణారెడ్డి, మధుసూదన్‌బాబు, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మణ్, శ్రావణ్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హన్మంతునాయక్

కొల్లాపూర్: పాలమూరు ప్రాజెక్టులో భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని నీటి పారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. సోమవారం హైదరాబాద్‌లో ఉత్తమ్ కుమార్‌రెడ్డిని మంత్రి జూపల్లి నిర్వాసితు రైతులతో వెళ్లి కలిశారు. రైతుల పక్షాన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హన్మంతునాయక్ మాట్లాడుతూ రైతులకు 123 జీఓ ప్రకారం కాకుండా జీఓ 120 ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. ప్రభుత్వ, అటవీ భూములను సాగుచేస్తున్న రైతులకు ఇప్పటికీ పరిహారం అందలేదని, వెంటనే వారికి పరిహారం అందించాలన్నారు. నిర్వాసితులకు పక్కా ఇళ్ల నిర్మాణం కోసం ఎల్లూరు శివారులోని సర్వే నంబర్లు 622, 623 భూములను గుర్తించారని, గత ప్రభుత్వం ఆ భూములకు బదులుగా వేరే భూమిలో ప్లాట్లు ఇచ్చారని వివరించారు. రైతుల కోరిక మేరకు సర్వే నంబర్లు 622, 623లోనే ప్లాట్లు ఇవ్వాలని విన్నవించారు. ఈ అంశాల పట్ల ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు రైతులు చెప్పారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పాటిల్ ప్రశాంత్ జీవన్‌ను ఆదేశించారని పేర్కొన్నారు. మంత్రి జూపల్లి వెంట గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎల్లూరు మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, జూపల్లి రఘుపతిరావు, రామన్‌గౌడ్, వెంకటస్వామి, రామునాయక్, బాలయ్య, స్వామి, బిచ్చిరెడ్డి, సీతారాంనాయక్ తదితరులున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి ముసుగులో భూకబ్జా



అసైన్డ్ దారులతో మాట్లాడిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

• మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఫైర్

జడ్చర్ల: గత ప్రభుత్వ హయాంలో జడ్చర్ల వంద పడకల ఆస్పత్రికి స్థలం కేటాయింపు ముసుగులో మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఆయన మేనల్లుడు విష్ణువర్ధన్‌రెడ్డి భూ ఆక్రమణలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వద్ద ఉన్న ఆధారాలతో పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సర్వే నంబర్ 149లో మొత్తం 7.33 ఎకరాలు ఉండగా.. 1988లో ఆర్మీ జవాన్ మశ్చంద్రనాథ్‌కు అప్పటి ప్రభుత్వం మూడెకరాల భూమిని కేటాయించిందన్నారు. అందులో 22 గుంటల భూమి జడ్చర్ల-కల్వకుర్తి రహదారి నిర్మాణంలో పోగా.. రోడ్డుకు ఇరువైపులా 2.18 ఎకరాలు మిగిలిందన్నారు. అందులో నుంచి 1.10 ఎకరాలను లక్ష్మారెడ్డి సోదరి సద్గుణ, 1.08 ఎకరాలను అరుణ్‌కుమార్ అనే వ్యక్తి కొనుగోలు చేశారన్నారు. అయితే రోడ్డులో పోయిన 22 గుంటల భూమి 2017 వరకు రికార్డులో ఉండటంతో మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మేనల్లుడు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని అన్నారు. ఇక అదే సర్వే నంబర్‌లోని మిగతా 4.33 ఎకరాలలో ప్రభుత్వం బాలయ్య అనే వ్యక్తికి 3.23 ఎకరాల భూమి అసైన్డ్‌గా ఇచ్చిందన్నారు. బాలయ్య తదనంతరం ఆయన వారసులైన సూరయ్యకు 1.08, కృష్ణయ్యకు 1.07, జంగయ్యకు 1.08 ఎకరాలు వచ్చినట్లు తెలిపారు. వీరికి చెందిన అసైన్డ్ భూమి నుంచి 2.15 ఎకరాలను ఆస్పత్రికి కేటాయించారన్నారు. అయితే ఇక్కడ ఆస్పత్రికి కేవలం 1.24 ఎకరాలు మాత్రమే అందుబాటులో ఉందంటూ, తహసీల్దార్ ధ్రువీకరణ ఇచ్చినట్లు చెప్పారు. తదుపరి ఆస్పత్రి పేరుతో అప్పటి ఆర్డీఓ హన్మంత్‌రెడ్డి నుంచి ఎన్ఓసీ తీసుకొని అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ సర్వే నంబర్‌లో మిగిలిన 1.10 ఎకరాలను విష్ణువర్ధన్‌రెడ్డి బినామీగా ఉన్న బోయలకుంట శివయ్య పేరున మారిందన్నారు. ఇక రోడ్డులో పోయిన 22 గుంటలను తాము కొనుగోలు చేసిన భూమిగా చూపి రోడ్డును అనుసరించి ప్లాట్లుగా ఏర్పాటుచేసి రూ. కోట్లు గడించే దందాకు తెరలేపారని ధ్వజమెత్తారు. ఈ భూమి అక్రమ లావాదేవీలలో కృష్ణయ్య, కొత్త మధు, కృష్ణారెడ్డి, రాజు అనే వ్యక్తుల పాత్ర ఉందన్నారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కాగా, వంద పడకల ఆస్పత్రి నిర్మాణం సమయంలో మున్సిపల్, ఇరిగేషన్ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని ఎమ్మెల్యే తెలిపారు. పూర్తిగా లోతట్టు ప్రదేశమని తెలిసినా తమ భూ అక్రమాలకు అడ్డాగా ఆస్పత్రిని వాడుకున్నారన్నారు. కాగా, అసైన్డ్ భూమికి పైసా పరిహారం ఇవ్వలేదని బాధిత రైతులు జంగమ్మ, సుకమ్మ తదితరులతో మీడియాకు చెప్పించారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీలు శివకుమార్, రబ్బానీ, మాజీ ఎంపీపీలు నిత్యానందం, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

గుట్కా పాకెట్ల పట్టివేత



దామరగిద్ద: నిషేధిత గుట్కా పాకెట్లను తరలిస్తున్న ఆటోను టాస్క్‌ఫోర్స్ టీం, స్థానిక పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎస్ఐ పి.రాజు వివరాల మేరకు.. మండలంలోని దేశాయ్‌పల్లికి చెందిన సత్యం కర్ణాటక రాష్ట్రం నుంచి నిషేధిత గుట్కా పాకెట్లను ఆటోలో తరలిస్తుండగా.. పక్కా సమాచారంతో వత్తుగుండ్ల శివారులో టాస్క్‌ఫోర్స్ టీం, స్థానిక పోలీసులు పట్టుకున్నారు. గుట్కాల విలువ రూ. 57,940 ఉంటుందని ఎస్ఐ తెలిపారు. సత్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.